

# కోరిక

కుమారస్వామిగారు సెక్రెటేరియట్‌లో సెక్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. ఆయన ఇద్దరు కొడుకుల తరవాత అమ్మాయి, ఆ తరవాత ఒక కొడుకుతో టెంపుల్ స్టాప్ పెట్టేశారు.

పెద్దకొడుకు దగ్గర్నుంచీ చివరి వాడి వరకూ తండ్రి మాటంటే ఎంతో గౌరవం భక్తీ ఉన్నాయి. అందుకే పెద్దకొడుకు లవ్వూ గివ్వూ అనకుండా తండ్రి చూపించిన పిల్లకే తాళి కట్టేశాడు మర్యాదగా. అప్పటివరకూ కూడా తండ్రి నడక్కుండా ఎక్కడికీ వెళ్ళేవాడు కాదు. అందుకే కుమారస్వామి గారి స్నేహితులంతా ఎంతో పొగిడేవాళ్ళు రత్నాల్లాంటి పిల్లల్ని కన్నావయ్యా అంటూ.

అందరిలోకీ భిన్నమైన వాడు చిన్నకొడుకు శేషు. పసితనం నుంచీ ఎంతో చురుకైనవాడు. తెలివితేటల్లో కూడా పెద్ద వాళ్ళే నుక్కున వేలేసుకునే వాళ్ళొక్కోసారి వాడి మాటలకు వయస్సు సరిగ్గా నాలుగు సంవత్సరాలుంటాయేమో ఒక్కోసారి మాటల్లో తండ్రినే బురిడీ కొట్టించేవాడు. కుమారస్వామి గారి కైతే నవ్వూకోపం ఒక్కసారే వచ్చేవి.

ఆరోజు ఆఫీసు నుంచి వచ్చేసరికి సాయంత్రం ఆరయింది. పెద్దకొడుకు కోడలు సినిమా కెళ్ళారు.

శేషూ సీరియస్‌గా కూర్చొని ఉన్నాడు. వాకిట్లో. తండ్రి లోపలకు వస్తుంటే ఎదురెళ్ళి చంకకు ఎక్కేసే వాడు ప్రతిరోజూ. అలాంటిది కదలకుండా తండ్రిని చూడనట్లే కూర్చొని.

శేషూ సీరియస్‌గా అలా ఉంటే ఇంట్లో ఎవరికీ తోచదు. వాడి అల్లరి చిలిపి మాటలకు అలవాటు పడ్డం తోటి.

రెండో కొడుకు చదువుకొంటూ కూర్చున్నాడు. లోపలి గదిలో. కూతురు తల్లికి వంటలో సాయం చేస్తూంది.

బట్టలు మార్చుకుని కాఫీ తాగి హాల్లోకి వచ్చి కుర్చీలో చతికిలబడి ఉండబట్టలేక రెండు అర చేతుల్లో ముఖం ఉంచుకొని ఆలోచిస్తున్న శేషూను మెల్లిగా కదిపారు.

"ఏంట్రా చిన్నీ ఆడుకోకపోయావా పక్కింటి రాజా తోటి ఒక్కడివే కూర్చున్నావే. దా యిలా" అంటూ దగ్గరకు పిల్చారు. వాడు కుర్చీలోంచి లేకుండానే

ఏం మాట్లాడలేదు శేషు.

మళ్ళీ తనే కదిపారు. 'ఏం చిన్నీ' కూర్చుని నిద్రపోతున్నావా?" అంటూ.

"లేదులే డాడీ" చురుగ్గానే సమాధానం వచ్చింది.

"ఎందుకలా ఉన్నావమ్మా. దా నా దగ్గరకు అని పిల్చారు మళ్ళీ.

"నే రానులే నాకు మీ మీద ఆవేశం వచ్చేసింది" అన్నాడు సీరియస్‌గా శేషు. (వాడి భాషలో ఆవేశం అంటే కోపం అని అర్థం లెండి).

"అలానా... ఎవరు తప్పు చేశారట నేను గానీ అమ్మ గానీ నీకు అవమానం చేయలేదు కదురా నాన్నా" అన్నారు పొద్దుట జరిగింది గుర్తుచేసుకుంటూ. (అవమానం అంటే కొట్టడం అని ఉంది వాడి డిక్షనరీలో.)

"అదేం కాదులే డాడీ" అన్నాడు విసుగ్గా.

"మరేమైందో చెప్పు చిన్నీ" అంటూ ఉన్నాడు.

లేచి శేషూని ఎత్తుకుని వాలుకుర్చీలో పడుకొని పొట్టపై కూర్చోబెట్టుకుంటూ బుజ్జగించారు.

"ఏం కావాలి చెప్పు? నీ కేమైనా స్వీట్సు కావాలా."

"ఏం వద్దు ఇంట్లో చాలానే ఉన్నాయిగా."

"మరి అమ్మ పెట్టలేదా."

"ఎందుకు పెట్టదేమిటి? నాకేగా కొందన్నీ" అంటూ జేబులో ఉన్న కాడ్‌బరీస్ తీసి చూపించాడు.

లోపలి నుంచి తండ్రీ కొడుకుల సంభాషణ అంతా వింటున్న కాంతమ్మగారు నవ్వుకొంది లోలోపలే, గట్టిగా నవ్వితే ఎంత ప్రమాదమో తెలుసు కాబట్టి. శేషూ సీరియస్‌గా 'ఇలా' ఉన్నప్పుడు ఎవరైనా నవ్వారా అది అవమానం చేసిందానికంటే ఎక్కువ సీరియస్‌గా తీసుకుంటాడు. ఇక వాడి ఏడుపు ఆపటం ఎవరివల్లా కాదు. అందుకే ఎవ్వరూ ఎంత నవ్వు వచ్చినా పెదాల మధ్యే ఆపుకుంటారు.

వీడి కెవరి పోలిక వచ్చిందోగానీ ఏదన్నా పట్టుకొంటే వదిలిపెట్టడు— అర్థమయేలా చెప్పకుండా ఏడిపించి చంపుతాడు కదా అనుకొంటూ— "అక్కగాని కొట్టిందేమిట్రా, చిన్నీ" అనడిగారు అనుమానంగా.

"నన్ను అవమానం చేసే హక్కెవరికీ లేదీ ఇంట్లో అని నీకు తెలియదా, డాడీ" అన్నాడు. అక్కడికి వాడేదో రాజాధిరాజన్నట్లు ముద్దు చేయడంవల్ల ఎవరూ కొట్టరన్న ధీమాతోటి.

"ఏంటో చెప్పమ్మా మా చిన్ని మంచివాడుగా ఏం కావాలో చెప్పు!" బుజ్జగించారు.

"నాకు పెళ్ళాం కావాలి" అన్నాడు సీరియస్‌గా.

కుమారస్వామిగారికి పెద్ద పెట్టున నవ్వు వచ్చింది. లోపల కాంతమ్మగారు, కూతురు కూడా బలవంతానే నవ్వాపుకొన్నారు.

వాడెప్పుడూ ఏదైనా ఇంతే సీరియస్‌గా అడుగుతాడు. నవ్వితే మాత్రం ఇల్లదిరిపోయేలా ఏడ్చేస్తాడు.

"పెళ్ళాం కావాలా, చిన్నా! తొందరగా పెళ్ళి చేసేస్తే పెద్దాడివవుతావుగా. అప్పుడు పెద్దన్నయ్యలా ఉద్యోగం వచ్చేస్తుంది. వెంటనే పెళ్ళి చేసేస్తాగా" అన్నారు లాలింపుగా.

"అదేం కాదు. నా కిప్పుడే కావాలి" అన్నాడు శేషూ మొండిగా.

"ఎందుకురా అంత తొందర" అన్నారు కాస్త విసుగ్గానే.

"ఎందుకేమిటి, డాడీ! మా ఫ్రెండ్స్ అంతా సినిమాలు చూస్తుంటారు వాళ్ళ మమ్మీ డాడీలతోటి. నువ్వు తీసుకెళ్ళవు. అమ్మ తీసుకెళ్ళదు. చిన్నన్న వెళ్ళడు. అక్కా వెళ్ళదు. ఎట్లా? నాకేమో జయమాలిని సినిమాలు వచ్చిపోతున్నా చూడలేకపోతున్నానంటే ఎంత బాధ వచ్చేస్తుందో తెలుసా" అన్నాడు ముద్దు ముద్దుగా.

జయమాలినీ సినిమాలు అంటున్నాడు శేషూ అని వాడిని అపార్థం చేసుకోకండి. వాడికి సినిమా బొమ్మలున్న ఏ పుస్తకం ఇచ్చినా కాస్త వాంప్ డ్రెస్ వేసుకున్న అమ్మాయి బొమ్మ కనిపించినా 'జయమాలినీ' అంటూ అరుస్తాడు, నిజానికి ఆ అమ్మాయి ఆ సినిమాలో హీరోయిన్ అయినా, మిగిలిన ఏ వటి పేరు వాడికి గుర్తుండదు. అందుకనే తప్పించి కొందరిలా వాడు ఆ వయస్సుకే జయమాలిని అంటే ఆ రకమైన అభిప్రాయంలో లేదు సుమండీ.

"పెళ్ళి చేసుకున్న తరువాత నుంచీ పెద్దన్నయ్య ఎంచక్కా వదినను వెంట వేసుకుని అన్ని సినిమాలుచూసేస్తున్నాడు. మీరూ అడ్డు చెప్పరు కదా అలా మరో అడ్డు చెప్పరు కదా అలా పెళ్ళాంతో సినిమాకెళుతుంటే. అందుకే నాకు పెళ్ళాం కావాలి" అని తేల్చి చెప్పేశాడు శేషూ.

నోరు తెరిచేశారు కుమారస్వామిగారు. వంటింటిలో నుంచి అంతా వింటున్న భార్యా, కూతురూ కూడా ఫక్కున పెద్దపెట్టున నవ్వేశారు శేషూ స్టేట్‌మెంట్ విన్నాక.

కుమారస్వామిగారే ముందు తేరుకొని ఇల్లాలిని పిలిచి, ఈసారి సినిమాకెళితే చిన్నీని తీసుకెళ్ళమని చెప్పేయటంతో శేషూ చల్లబడ్డాడు ఆ రోజుకి. *

- తిరునగరి వెంకటనారాయణమూర్తి